

సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 34.350 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా పెన్నార్ డెల్టాకు 2,300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) -	రూ.61,340
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)-	రూ.5,509
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,674
నవర (8 గ్రా) -	రూ.45,392

వాతావరణం

గరిష్టం/కనిష్టం 42.5 /31.9

శుక్రవారం గాలిలో తేమ 32 శాతం ఉంది. శనివారం అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయి. వేడిగాలులు, ఉక్కపోత ఉంటాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

‘కొమ్మి’కి ఘోర పరాభవం

- లోకేశ్‌ను కలిసేందుకు అనుమతివ్వని ప్రైవేట్ సెక్యూరిటీ
- బొమ్మవరం సైట్ క్యాంపులో అవమానం
- ఆత్మకూరులో టీడీపీ రెబల్‌గా పోటీ చేస్తానంటూ ‘కొమ్మి’ ప్రకటన
- పాదయాత్రకు దూరంగా ఉన్న కన్నబాబుకు ఫోన్ చేసి ఆవేదన
- టీడీపీ మండలస్థాయి నేతలదీ ఇదే పరిస్థితి

లోకేశ్ పాదయాత్రలో ఆయనను కలిసేందుకు వచ్చిన టీడీపీ నేతలతోపాటు మాజీ ఎమ్మెల్యేకి అవమానాలు ఎదురయ్యాయి. పార్టీ కోసం కష్టపడుతున్న తమను లోకేశ్‌ను కలిసేందుకు కూడా అనుమతించకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడుకు ఈ పరిస్థితి ఎదురుకావడంతో ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ తాను ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఆత్మకూరు: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పాదయాత్రలో మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత కొమ్మి లక్ష్మయ్యనాయుడుకు ఘోర పరాభవం జరిగింది. అనంతసాగరం మండలంలోని బొమ్మవరం సైట్ క్యాంపులో గురువారం సాయంత్రం యువతతో లోకేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఆ సమావేశానికి కొమ్మి హాజరయ్యేందుకు సమావేశం ప్రారంభం కాక ముందే వెళ్లారు. ఆ సమయంలో లోకేశ్ విశ్రాంతి క్యాంప్‌లోనే ఉండడంతో ఆయన్ను కలిసేందుకు కొమ్మి వెళ్లారు. అయితే అక్కడ ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది కొమ్మిని లోపలికి అనుమతించలేదు. తాను మాజీ ఎమ్మెల్యేనని చెప్పుకున్నా ఇన్‌చార్జి అనుమతి ఉంటేనే లోపలికి పంపుతామని తెగేసి చెప్పారు. సీనియర్ నేతగా ఉన్న కొమ్మికి చినబాబు క్యాంప్ వద్ద పరాభవం ఎదురుకాగా, పార్టీలో చోటా లీడర్లు వెళ్లి లోకేశ్‌ను కలిసి వస్తుండడంతో ఆయన ఈ అవమానాన్ని తట్టుకోలేకపోయారు. తనను పార్టీ నుంచి పొమ్మని పొగబెడుతున్నారా? అంటూ మండిపడ్డారు.

ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానంటూ..

లోకేశ్ సెక్యూరిటీ కొమ్మి లక్ష్మయ్యనాయుడు పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్న సమయంలో అక్కడే ఉన్న ఆనం రామనారాయణరెడ్డి కుమార్తె కైవల్యారెడ్డి, ఆమె భర్త ఉండి కూడా చూసీచూడనట్లుగా వ్యవహరించడంపై ఆయన తీవ్రంగా ఆవేదన చెందినట్లు సన్నిహితులు చెబుతున్నారు. దీంతో తాను రానున్న ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఆనంను ఓడించేందుకు కృషి చేస్తానని శపథం చేశారు. తనకు ఇలాంటి అవమానాలు ఎదురైతే పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని, ఇది గుర్తెరగాలని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం శిబిరం వెలుపలకు వచ్చి విదేశీ పర్యటనలో ఉన్న ఆ పార్టీ నేత గూటూరు కన్నబాబుకు ఫోన్ చేసి తనకు జరిగిన పరాభవాన్ని వివరించారు. ఏదో ఒక నిర్ణయం తీసుకోకపోతే ఈ పార్టీలో అవమానాలు తప్పవని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది.



మండలస్థాయి నేతలకూ అవమానం

మర్రిపాడు, అనంతసాగరం మండలాల టీడీపీ నాయకులు ఆరికట్ల జనార్దన్‌నాయుడు, సద్దా రవీంద్రలకు కూడా ఇలాంటి అవమానాలు జరిగినట్లు పార్టీ నేతలు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. ఆనం రామనారాయణరెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, కనీసం లోకేశ్‌కు తమను పరిచయం చేసేందుకు అవకాశం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికితోడు అనంతసాగరంలో నిర్వహించిన బహిరంగ సభకు జన సమీకరణ కోసం తమను సంప్రదించకుండా ఆనం తన సొంత వ్యక్తులకు ఆ పని పురమాయించడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే ఉంటే తెలుగుదేశం గెలిచే సంగతి దేవుడెరుగు డిపాజిట్‌లు కూడా దక్కవని పలువురు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

‘స్వమిత్వ’పై దృష్టి సారించాలి



- కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): గ్రామీణ ప్రజలకు ఆస్తిపై హక్కు కల్పించి ఆస్తి కార్డులను పంపిణీ చేసే స్వమిత్వ (సర్వే ఆఫ్ విలేజెస్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రోవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్) కార్యక్రమంపై దృష్టి సారించాలని అధికారులను కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో ‘స్వమిత్వ’ కార్యక్రమం అమలుపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో స్వమిత్వ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. డ్రోన్ సర్వే, గ్రౌండ్ ట్రూతింగ్, మ్యాపింగ్, ఓఆర్ఐ తయారు చేయడం, ఆస్తి కార్డులు పంపిణీ చేయడం వంటి ప్రక్రియలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని తెలిపారు. తొలుత డీపీఓ సుస్మిత మాట్లాడుతూ జిల్లాలోని 722 గ్రామ పంచాయతీల్లో డ్రోన్ సర్వే పూర్తి అయిందని, 127 గ్రామ పంచాయతీలకు ఓఆర్ఐ మ్యాప్‌లు సిద్ధం చేశామని, 94 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయిందని, 30 గ్రామాల్లో సర్వే పురోగతిలో ఉందని తెలిపారు. సమావేశంలో సర్వే, ల్యాండ్ రికార్డుల ఏడీ హనుమాన్ ప్రసాద్, సర్వేయర్లు పాల్గొన్నారు.

కల్లబొల్లి మాటలతో చంద్రబాబు కొత్త డ్రామా

- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



ఇందుకూరుపేట: పేదలకు ఏనాడూ మంచి చేయని ప్రతిపక్షనేత చంద్రబాబు.. ఇంకొక్క ఛాన్స్ ఇస్తే అది చేస్తాం.. ఇది చేస్తామంటూ కల్లబొల్లి మాటలతో కొత్త డ్రామాకు తెరలేపారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. ఇందుకూరుపేటలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి పేదవాడికి సొంత గూడు ఏర్పాటు చేసి రూ.లక్షల్లో ఆర్థిక భద్రత కల్పించిందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలందరికీ అందాలన్న ఉద్దేశంతో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేశారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ పొందాలంటే జన్మభూమి కమిటీల సిఫార్సు చేస్తేనో లేదా ఏవరైనా చనిపోతేనో పింఛన్ వచ్చే పరిస్థితి ఉండేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్ అందిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ‘జగనన్న ఆణిముత్యాలు’ పేరుతో ప్రభుత్వం వారికి నగదు ప్రోత్సాహకాలు అందించడం ఒక చరిత్ర అన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు పోటీ పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీ డీఏల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్, డీసీఎమ్మెస్ చైర్మన్ గునపాటి సురేష్‌రెడ్డి, గురజాల జ్ఞానస్వరూప్, వేళ్ల భానుచంద్రశేఖర్ పాల్గొన్నారు.

మోసగించిన కేసులో 8 మందికి జైలు

నెల్లూరు(లీగల్): డిపాజిటర్ల వద్ద డబ్బులు వసూలు చేసి చెల్లించకుండా మోసగించినట్లు నమోదైన కేసులో చెన్నై, నెల్లూరు ప్రాంతాలకు చెందిన నిందితులు మోచర్ల శ్రీనివాసులు, షంకే డేవిడ్, నెల్లూరు క్రాంతికుమార్‌లకు ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.60 వేల జరిమానా, గిరిజాదేవి, పి.కార్తీక్, కె.విజయ్, ఎబినైజర్, గోపిలకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు చెన్నై ప్రాంతానికి చెందిన బోనుగుంట ప్రసాద్ 2002లో చెన్నైలో భారత్ ప్రేమసదన్ ట్రస్ట్ ఏర్పాటు చేసి అందులో ఎండీ(మేనేజింగ్ డైరెక్టర్)గా కొనసాగాడు. ఆయన చెన్నై, నెల్లూరుతో పాటు పలు ప్రాంతాల్లో ఏజెంట్లను ఏర్పరుచుకుని ప్రజల నుంచి నెలకు రూ.11 వేల చొప్పున మూడు నెలలపాటు చెల్లిస్తే 6 నెలలకు రెట్టింపు ఇస్తామని నమ్మించి సుమారు రూ.2.89 కోట్లు వసూలు చేశాడు. ఈ నగదును 2011 సెప్టెంబర్ 4వ తేదీన మోచర్ల గోపి కారులో చెన్నైకి తీసుకెళుతుండగా వెంకటాచలసత్రం పోలీసులు తనిఖీ చేశారు. కారులోని రెండు పెద్ద బ్యాగుల్లో ఉన్న రూ.2.89 కోట్ల నగదును గుర్తించారు. అతనిని విచారించగా భారత్ ప్రేమసదన్ ట్రస్ట్‌కు సంబంధించిన నగదు అని తెలుపగా పోలీసులు అతనిని అరెస్ట్ చేసి ఆ నగదును స్వాధీనం చేసుకొని కేసును సీబీసీఐడీకి అప్పగించారు. కేసును నమోదు చేసిన సీబీసీఐడీ పోలీసులు దర్యాప్తు అనంతరం 29 మందిపై చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు బోనుగుంట ప్రసాద్ విచారణకు గైర్హాజరు కావడంతో అతనిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసి, మిగతా నిందితులపై కేసు నమోదు చేసి విచారించారు. విచారణలో 8 మందిపై నేరం రుజువు కావడంతో పై మేరకు శిక్ష, జరిమానా విధించారు. మిగిలిన వారిపై కేసు కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అయ్యప్ప రెడ్డి కేసు వాదించారు.

ఈకేవైసీ తప్పనిసరి

నెల్లూరు(సెంట్రల్): పీఎం కిసాన్ పథకం ద్వారా వచ్చే నగదు చాలా మందికి కొన్ని సాంకేతిక సమస్యల వల్ల రాలేదని, ఈకేవైసీ చేయించుకున్న రైతులకు తప్పకుండా పీఎం కిసాన్ నగదు వారి అకౌంట్లలో జమ అవుతుందని వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై నెలలో రైతుల అకౌంట్లలో పీఎం కిసాన్ నగదు జమ అవుతుందని, ఈ నెలాఖరు లోపు స్థానిక ఆర్‌బీకేల్లో ఉండే వీఏఏల ద్వారా ఈకైవేసీ చేయించుకోవాలని తెలిపారు.

కనువిప్పేది?

నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ వద్ద ప్రయాణికులు ప్రమాదకరంగా పట్టాలపై రాకపోకలు సాగిస్తున్నారు. స్టేషన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు ఉన్నా వాటిని వినియోగించకుండా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జి మీద ఇలాగే రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో ఈ ప్రదేశంలో పలువురు ప్రాణాలను పోగొట్టుకున్నా కనువిప్పు కలగకపోవడం దురదృష్టకరం. -సాక్షి,ఫొటోగ్రాఫర్, నెల్లూరు



నెల్లూరు రైల్వేస్టేషన్‌లో రైలు వస్తుండగా పట్టాలను దాటుతున్న ప్రయాణికులు



ఆత్మకూరు బస్టాండ్ వద్ద రైల్వే బ్రిడ్జి మీద పట్టాలపై వెళ్తున్న ప్రయాణికులు



రైల్వేస్టేషన్‌లో చిన్నపిల్లలతో పట్టాలు దాటుతున్న తల్లిదండ్రులు

ఆర్ఐఓగా ఆదూరు శ్రీనివాసులు



ఆదూరు శ్రీనివాసులు

నెల్లూరు(టౌన్): ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐఓ)గా ఆదూరు శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ఇంటర్‌బోర్డు కార్యాలయం నుంచి జిల్లా కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. ఈయన ప్రస్తుతం రాష్ట్ర ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఎగ్జామినేషన్ ఆఫ్ కంట్రోలర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో జిల్లాలో డీవీఈఓగా, డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆర్ఐఓగా పనిచేస్తున్న వరప్రసాదరావు సూళ్లూరుపేటలోని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా నియమితులయ్యారు.

వెబ్‌సైట్‌లో తాత్కాలిక మెరిట్ జాబితా

నెల్లూరు(టౌన్): జిల్లాలోని 10 కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న 42 పోస్టుల భర్తీకి సంబంధించి తాత్కాలిక మెరిట్ జాబితాను www.apcfss.kgbv.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీల్లో 42 పోస్టులకు మొత్తం 1,622 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. తాత్కాలిక మెరిట్ జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే శనివారం సాయంత్రం 3 గంటల లోపు తగిన ఆధారాలతో సమగ్ర శిక్ష కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

ఓటర్ల జాబితాల్లో మార్పులు,చేర్పులపై ప్రత్యేక దృష్టి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఎం హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పులకు సంబంధించిన క్లెయిమ్స్‌ను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని కలెక్టర్ ఎం హరినారాయణన్ పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లతో ఓటర్ల నమోదు, తొలగింపు, ఓటర్ల జాబితాల నవీకరణ, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల నమోదు దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 19,13,321 మందిని ఓటర్లుగా గుర్తించామని చెప్పారు. జనవరి 6 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 17,556 మందికి నూతనంగా ఓటు హక్కు కల్పించామని వెల్లడించారు. చిరునామా మారడం, మరణించడం, తదితర కారణాలతో 6,956 ఓట్లను తొలగించామని తెలిపారు. ఫారం–6కు సంబంధించి 9,580 దరఖాస్తులు రాగా, 6,971 దరఖాస్తులను ఆమోదించామని చెప్పారు. 1305 దరఖాస్తులను తిరస్కరించామని, 1304 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని వివరించారు. 17 ఏళ్లు దాటిన వారికి సంబంధించి 2,454 మంది నుంచి ముందస్తుగా ఫారం–6ను తీసుకున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ ఏ ఒక్క ఓటరుకు ముందస్తు నోటీసు ఇవ్వకుండా సుమోటోగా ఓటర్లను తొలగించరాదన్నారు. నోటీస్ ఇచ్చిన తరువాతే తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 16 వరకు ఓటరు జాబితా డ్రాఫ్ట్ ప్రచురణ, అక్టోబర్ 17 నుంచి డిసెంబర్ 26 వరకు సమగ్ర జాబితా డ్రాఫ్ట్ రోల్ ప్రచురణ, 2024 జనవరి 1న సప్లిమెంట్ జాబితా ప్రచురణ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ రోణంకి కూర్మనాథ్, నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్, కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక, ట్రెయినీ కలెక్టర్ విద్యాధరి, డీఆర్వో వెంకట నారాయణమ్మ, ఆర్డీఓలు మాలోల, శీనానాయక్, కరుణకుమారి, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

24న ఆత్మకూరులో మెగా జాబ్‌మేళా



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆత్మకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 24న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన నెల్లూరులోని తన నివాసంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులతో కలిసి జాబ్ మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత కోసం నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళా ద్వారా 15 కంపెనీల్లో 1300కుపైగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. పదో తరగతి నుంచి ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ వరకు చదివిన నిరుద్యోగులు అర్హులని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి జరిగే జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి వినీల్ కుమార్, డీఆర్డీఏ జిల్లా జాబ్ మేనేజర్ హైమావతి, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 14 మంది డిబార్

వెంకటాచలం: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించి డిగ్రీ నాల్గో, ఆరో సెమిస్టర్ పరీక్షల్లో 14 మంది విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల నియంత్రణాధికారి ఆర్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నిర్వహించిన నాల్గో సెమిస్టర్ పరీక్షకు 10,430 మందికి గానూ 9,772 మంది హాజరయ్యారని, 696 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. వివిధ పరీక్ష కేంద్రాల్లో 10 మంది డిబార్ అయ్యారని పేర్కొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన ఆరో సెమిస్టర్ పరీక్షకు 927 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 73 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. విడవలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, నెల్లూరు నగరంలోని వీఆర్ ఐపీఎస్ కళాశాలలో ఒక విద్యార్థి డిబార్ అయ్యారని తెలిపారు.

వెంగమాంబకు రూ.49.38 లక్షల రాబడి



హుండీ కానుకలను లెక్కిస్తున్న భక్తులు

దుత్తలూరు: నర్రవాడలో కొలువైన వెంగమాంబ పేరంటాలుకు బ్రహ్మోత్సవాల ద్వారా రూ.49,38,118 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వెట్టిగుంట ఉషశ్రీ తెలిపారు. వెంగమాంబ ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను దేవాదాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. హుండీ నగదు కానుకల ద్వారా రూ.26,07,420 రాబడి వచ్చినట్లు ఈఓ తెలిపారు. తాత్కాలిక అంగళ్ల వేలం ద్వారా రూ.7.95 లక్షలు, లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా రూ.7,48,395, దర్శనం టికెట్ల విక్రయం ద్వారా రూ.7,07,770, తలనీలాల టికెట్ల ద్వారా రూ.37,765, కల్యాణం చదివింపుల ద్వారా రూ.24,308, ఇతర టికెట్ల విక్రయం ద్వారా రూ.17,460 ఆదాయం వచ్చినట్లు వివరించారు. హుండీ లెక్కింపుల్లో ఆలయ వ్యవస్థాపక ప్రధాన ధర్మకర్త పచ్చవ వెంకటేశ్వర్లు, వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ కరుణాకర్, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షకు ప్రత్యేక అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 23న ప్రారంభించనున్న జగనన్న సురక్ష పథకం కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేసేందుకు కలెక్టర్ ఎం హరినారాయణన్ ప్రత్యేకాధికారులను నియమించారు. సూపర్‌వైజర్ ఆఫీసర్లుగా డీఆర్డీఏ పీడీ కే సాంబశివారెడ్డి, డ్వామా పీడీ వెంకట్రావు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ సుస్మితారెడ్డిని నియమించారు. అసిస్టెంట్ సూపర్‌వైజర్లుగా నెల్లూరు డీఓడీఎల్ వసుమతి, డీఓపీఎల్ కే శ్రీనివాసరావు, కావలి డీఓడీఎల్ కనకదుర్గాభవాని, డీఓపీఎల్ మాధవి, ఆత్మకూరు డీఓడీఎల్ రమణయ్య, కందుకూరు డీఓడీఎల్ పద్మజ, డీఓపీఎల్ కృష్ణమోహన్‌ను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

దివ్యాంగ విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం



కీర్తనకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న ఉషారాణి, ధనమ్మ

నెల్లూరు (టౌన్): జిల్లాలోని లింగసముద్రం భవిత సెంటర్‌కు చెందిన దివ్యాంగ విద్యార్థిని మండ్ల కీర్తన 2022–23 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో 503 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా కీర్తనకు సమగ్రశిక్ష సహిత విద్యా కోఆర్డినేటర్ సితారి ధనమ్మ స్వయంగా రూ.10వేలు ప్రోత్సాహకాన్ని ఇవ్వాలని నిర్ణయించారు. శుక్రవారం జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో ఏపీసీ కోఆర్డినేటర్ ఉషారాణి సమక్షంలో కీర్తనకు రూ.10వేలు ప్రోత్సాహకాన్ని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థినిని ప్రోత్సహించేందుకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేసిన ధనమ్మను అభినందించారు. దివ్యాంగ విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి చదువుపై ఆసక్తిని పెంపొందించి మంచి ఫలితాలు సాధించే విధంగా స్పెషల్ ఎడ్యుకేటర్లు కృషి చేయాలన్నారు.

అతివేగానికి విద్యార్థి బలి



చందు మృతదేహం

నెల్లూరు(క్రైమ్): అతివేగానికి ఓ విద్యార్థి బలయ్యాడు. స్నేహితులను స్కూటీపై బస్టాండ్ వద్ద వదిలి వస్తున్న క్రమంలో మలుపులో వేగాన్ని నియంత్రించలేక అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని మృతి చెందాడు. ఈ ఘటన పడారుపల్లి వద్ద మినీబైపాస్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. సౌత్‌ట్రాఫిక్ పోలీసుల వివరాల మేరకు.. తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలం నిండలికి చెందిన ఎం నారాయణ కుమారుడు ఎం చందు(19) బీవీనగర్‌లోని ఎస్టీ కళాశాల వసతిగృహంలో ఉంటూ మినీబైపాస్‌రోడ్డులోని జీవీఆర్ఆర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఆదిపురుష్ సినిమా విడుదల సందర్భంగా తోటి స్నేహితులు ఇద్దరు గూడూరులో టికెట్లు బుక్ చేసుకున్నారు. దీంతో శుక్రవారం ఉదయం చందు స్నేహితులు ఇద్దరిని స్కూటీపై ఎక్కించుకుని అయ్యప్పగుడి వద్ద వదిలిపెట్టాడు. అనంతరం అయ్యప్పగుడి ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా హాస్టల్‌కు బయలుదేరాడు. ఫ్లైఓవర్ దిగి పడారుపల్లి ఎంట్రన్స్ వద్దకు వచ్చేసరికి స్కూటీ వేగాన్ని నియంత్రించలేక డివైడర్‌ను ఢీకొట్టాడు. కొంత దూరం రోడ్డు మీద ఈడ్చుకుంటూ వెళ్లి కరెంట్‌పోల్‌ను ఢీకొనడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సౌత్‌ట్రాఫిక్ ఎస్సై అబ్దుల్ రహీమ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

కన్నీటి పర్యంతమైన కుటుంబం

నారాయణకు భార్య, ముగ్గురు సంతానం.. ఇద్దరు ఆడపిల్లలు కాగా చందు కుమారుడు. నారాయణ స్థానికంగా పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుమారుడ్ని కష్టపడి చదివిస్తున్నాడు. గురువారం కుమారుడి వద్దకు వచ్చి అవసరమైన యూనిఫామ్, పుస్తకాలు, ఇతర సామగ్రి కొనిచ్చాడు. కుమారుడితో సంతోషంగా గడిపాడు. కష్టపడి చదువుకోవాలని సూచించి వెళ్లాడు. ఇది జరిగి 24 గంటలు కాకముందే కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలుసుకుని నారాయణతో పాటు కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. హుటాహుటిన నెల్లూరు జీజీహెచ్‌కు చేరుకుని చందు మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా రోదించారు. ప్రభుత్వ వైద్యులు మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

పార్టీలు మారడం సరికాదు



మాట్లాడుతున్న చింతామోహన్

నెల్లూరు(మినీబైపాస్): రోజుకో పార్టీ మారడం సరైన పద్ధతి కాదు.. పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డిలను ఆదర్శంగా తీసుకోవాలని అంటూ ఆనం రామనారాయణరెడ్డిని ఉద్దేశించి కాంగ్రెస్ మాజీ ఎంపీ చింతా మోహన్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్‌లో తమ పార్టీ గెలవబోతోందని తెలిపారు. అధికారంలో ఉన్నా లేకున్న ఒకే పార్టీలో అంకితభావంతో ఉండాలన్నారు. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు కొన్ని విదేశీ శక్తుల వల్ల విడిపోయాయని, మళ్లీ జత కట్టి బీజేపీని చిత్తుగా ఓడిస్తామన్నారు. రాష్ట్రంలో 175కు 120 స్థానాల్లో గెలుస్తామన్నారు. చంద్రబాబు, బీజేపీపై ప్రజలకు నమ్మకం లేదన్నారు.

వీఆర్వోల బదిలీలు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని పలువురు వీఆర్వోలను బదిలీ చేస్తూ డీఆర్వో వెంకటనారాయణమ్మ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మ్యూచువల్స్‌కు సంబంధించి 34 మందిని బదిలీ చేయగా.. స్పౌజ్, అనారోగ్యానికి సంబంధించి 8 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 42 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నాల్గో రోజూ కొనసాగిన పాదయాత్ర



టీడీపీ నాయకుడు చంద్రారెడ్డిని హెచ్చరిస్తున్న లోకేశ్

ఆత్మకూరు: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర ఆత్మకూరు నియోజకవర్గంలో నాల్గో రోజైన శుక్రవారం కూడా కొనసాగింది. సాయంత్రం 5.30 గంటలకు సంజీవనగర్ సైట్ క్యాంపు నుంచి పాదయాత్రను ప్రారంభించిన లోకేశ్ 6.45 గంటలకు అనంతసాగరంలోని బహిరంగ సభ వద్దకు చేరుకున్నాడు. బహిరంగ సభను ఇరుకుప్రదేశంలో ఏర్పాటు చేయడం, మూడు గంటలకుపైగా ట్రాఫిక్‌ను నిలిపివేసి ప్రజలను కదలనీయకుండా చేయడంతో వారు ఇబ్బందులు పడ్డారు. బహిరంగ సభ అనంతరం మంచాలపల్లి, బేలజంగాలపల్లి గ్రామాల మీదుగా వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి మండలం కుల్లూరు సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన శిబిరానికి రాత్రి 10 గంటలకు లోకేశ్ చేరుకున్నారు. కాగా బహిరంగ సభ స్టేజీ మీదకు తనను అనుమతించకపోవడంపై లోకేశ్ కు ఆత్మకూరుకు చెందిన టీడీపీ నాయకుడు తుమ్మల చంద్రారెడ్డి ఫిర్యాదు చేశాడు. తాను పార్టీ పట్టణాధ్యక్షుడినని, సుమారు 4వేల మందిని బహిరంగ సభకు తీసుకొచ్చిన తనను స్టేజీ మీదకు ఎక్కించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో లోకేశ్ కోపంగా ఆగు బ్రదర్ నేను చెప్పేది విను అంటూ స్టేజీ మీదకు ఎక్కిస్తేనే నాయకులు కాదని, ముందు పార్టీ కోసం పనిచేయాలని హెచ్చరించారు. దీంతో చిన్నబోయిన చంద్రారెడ్డి మౌనంగా ఉండిపోయాడు. ఆనం రామనారాయణ రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 176
లేయర్ (లైవ్)	: 108
బ్రాయిలర్ చికెన్	: 296
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 326
లేయర్ చికెన్	: 184

నిమ్మధరలు

పొదలకూరు (కిలో)



పెద్దవి	: రూ. 35
సన్నవి	: రూ. 20
పండ్లు	: రూ. 7

సాక్షి క్లాసిఫైడ్స్